


## 1

బుష్‌కోటుమీద ఒకరోజున సీతారామయ్యగారికీ శంకరానికీ మధ్య యుద్ధం జరిగినంత పనయింది. అసలు సీతారామయ్యగారే పిలచి పేచీపెట్టారు. దారిన పోయే శంకరాన్ని పిలచి, "ఆ బుష్‌కోటేమిటి, మహాశయా! బుడబుక్కలవాడి వేషంలాగ; విప్పేద్దురూ. చాలా అసహ్యంగా వుంది" అన్నారు సీతారామయ్యగారు.

శంకరానికి చిర్రెత్తుకొచ్చింది. "మీ లాల్చీ మీ మొహంలా వుంది. దాన్నొకసారి చాకలాడికైనా పారెయ్యండి డబ్బులు నేనైనా ఇచ్చుకుంటాను. నే నేడ్రెస్సు వేసుకుంటే మీ కెందుకండీ. మిమ్మల్ని కొట్టానా? తిట్టానా? ఎందుకు మీ కింత అసహనం? ఒకళ్లు రెపరెపలాడుతూ కనిపిస్తే ఊళ్ళోవాళ్లకి పిచ్చెక్కుతుం దనుకుంటాను? ఇల్లాగ దారినపోయేవారిని చూసి రాగివెయ్యకపోతే సంసారాని కుపయోగపడే పని ఏదైనా చేసుకోరాదూ? బుష్‌కోటు వేసుకున్నందుకు మీరు నన్ను విమర్శించడానికి హక్కు వుంటే, లాల్చీ వేసుకున్నందుకు మిమ్మల్ని నేనూ విమర్శించగలను. ఇన్నాళ్లూ పెద్దలని పూజిస్తుంటున్న కొద్దీ మీరు మరీ లోకువ కట్టి నన్నూ నా గామాల్ని ఆడ్డమైనచోటా తిడుతున్నారు." అని శంకరం నాలుగూ దులిపేశాడు.

చిన్నపెద్ద తారతమ్యం ఎరగకుండా పేలకని సీతారామయ్యగారనుకున్నారు.

ఉదయపుర గ్రామం పెద్దల కొక విచిత్రమైన మనస్తత్వం వుంది. రంధ్రాన్వేషణం అంటే వాళ్లకెంతో ఇష్టం.

ఓర్వలేనితనం వాళ్లలో ఒక పెద్దజాడ్యం. ఇతరుల స్నేహం ఆనందం వారికి చాలా కంటకంగా వుంటాయి.

రామం, శంకరం కలసి టిక్కుటక్కుగా తిరుగుతోంటే వీధి అరుగులమీద పనీపాట లేక చుట్ట కాల్చుకుంటూ కూర్చున్న పెద్ద మనుష్యులు డిసెంటరీ పట్టుకున్నవాళ్ళవలె గిలగిల కొట్టుకునేవారు.

రామానికి శంకరానికి మద్రాసులో కాలేజీలో చదువుతున్న రోజుల్లో గాఢ స్నేహం ఏర్పడింది. ఆ రోజుల్లోనే వారు నవనాగరికతా లక్షణాలు కొన్ని అలవరచుకున్నారు. ఎప్పుడూ దొరల్లాగ "ట్రిమ్‌గా డ్రెస్ వేసుకుంటారు. సూటైనా వేస్తారు. లేదా చొక్కా నిపేంటులోపలికి కుక్కుతారు. అదేమిటో, చొక్కా పైనవేస్తే, వారి విలువతగ్గినట్లు, లోపల దూరిస్తే హెచ్చినట్లు వాళ్ళు భావిస్తారు. పేంటుగాని, చొక్కాగాని, కోటుగాని ఒక పిసరైనా మాసినా, చినిగినా దానిని విసర్జింపవలసిందే. సరి, ఈ మధ్య బుష్‌కోట్లంటూ మిడతల దండులాగ వచ్చిపడ్డాయి. ఇక, తద్దినంలాగ రోజూ గెడ్డం గియ్యవలసిందే. బూట్లకు రోజూ పాలిష్ చెయ్యవలసిందే.

భార్యను ఇంట్లోంచి గెంటేశాను అని రామం ఉత్తరం వ్రాశాక శంకరం ఉదయపురానికి బదిలీ చేయించుకున్నాడు. ఇప్పుడిద్దరూ ఒక గూటిపిట్టలే అయ్యారు. ఎంతో ప్రేమించి పెళ్ళిచేసుకున్న శంకరంభార్య నోటీసైనా ఇయ్యకుండా హఠాత్తుగా చనిపోయింది.

రామం భార్య విషయంలో రెండు విధాలుగా చెప్తూంటారు. తనే "దాన్ని" ఇంట్లోంచి "గెంటేశానని" రామం అంటాడు. అదే ఏ తురకాడితోనో లేచిపోయిందని కొందరంటారు. రామం చిల్లరమల్లరగా "పోకిరీ వెధవలా" తిరగడంవల్ల దానికి విసుగెత్తి, వీడితో వేగలేక లేచిపోయిందని ఒక వాదం. నిజానికి, రామానికి అమ్మాయిలంటే పడి చచ్చిపోయే దురభ్యాసం వుందిట. ట్రాముల్లో "లోపల సీటుంది. పోయి కూర్చోండి" అని కండక్టరు ఎంత మొత్తుకున్నా వినక అమ్మాయిలు కూర్చున్నచోటే త్వాష్ట్రింలాగ నిలబడి బఫూను చేష్టలు చేసేవాడట. ఏ బస్సులోనో ఒక అందమైన అమ్మాయి మందహాసం ఎందుకో జేస్తే, ఏతత్ మందహాసం తనకోసమే ఉద్దేశింపబడినదనుకుని మురిసిపోయి, సదరు అమ్మాయి ఎక్కినబస్సే ఎక్కి, దిగినచోటే దిగి, కుక్కలా వెంటబడి, తీరా ఆవిడ తీక్ష్ణమైన ఛీదరింపు దృష్టితో ఇతన్నిచూసి ఇంట్లోకి పోయేసరికి వీపు విరుచుకుంటూ ఇంటికి వచ్చేవాడట. అతనికి అందం లేదుకాని అంగసౌష్టవం వుంది. మనిషి షోకీలా కనిపిస్తాడు. "సొసైటి గరల్స్" కింద చెలామణీ అవుతున్న కొంతమంది "కిరస్తానీ" పిల్లలు తన వెంటపడేసరికి, పెద్ద గొప్పకింద యివన్నీ భార్యతో చెప్పేవాడట. ఈ విషయంలో ఇద్దరికీ రోజూ పోట్లాట జరిగేది. మరి ఎవరు ఎవర్ని విసర్జించారో ఎవరికీ తెలియదు.

ఉదయపురం వచ్చినప్పటినుంచి శంకరం ఎప్పటికప్పుడు రామాన్ని ఈ విషయంలో వారిస్తూనే వచ్చాడు. కాని రామం "ఈ విషయంలో జోక్యం కలిగించుకోవద్దు" నేవాడు. ఆఖరికి గుళ్ళో పురాణం జరుగుతున్నప్పుడు, ఆడవాళ్లను చూసి రామం పోకిరిచేష్టలు కొన్ని చెయ్యగా, పురాణం వినడానికి వచ్చిన వారిలో కొంతమంది దృఢకాయులు (అందులోనూ ఆవూర్లో రేషనింగు లేదేమో) మెత్తగా కుళ్ల పొడిచాకగాని రామం ఈ దురభ్యాసానికి స్వస్తి చెప్పలేదు. అవమానం భరించలేక రెండునెలలు మంచం పట్టాడు. చావు తప్పి కన్ను లొట్టపోయింది.

## 2

సీతారామయ్యగారికి పిల్ల పెళ్లివిషయం గడ్డుసమస్యగా పరిణమించింది. అదేమిటో 18 ఏళ్లు దాటాక ఆడపిల్లలు నిచ్చెన ఎక్కినట్లు పెరిగిపోతారు. ఎదిగిన పిల్లని ఇంట్లో వుంచుకోవడం హిందూ మతాచారం ప్రకారం మహాపాపం మరి. ఏళ్లు హెచ్చినకొద్దీ పిల్ల భారం, కాలదోషం పట్టినకొద్దీ కన్యాత్వం తాలూకు పాపం హెచ్చిపోతుంటాయి. "ఏమయ్యా, పిల్ల పెళ్లి ఎప్పుడేమిటి?" అన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేక చూస్తున్నాడు శీతరామయ్యగారు.

ఆడపిల్లకు పెళ్లిచెయ్యడం అంటే ఈ రోజుల్లో మాటలా? తక్కిన వస్తువుల ధరలతోపాటు పెళ్లికొడుకుల ధరలుకూడా మండిపోతున్నాయి. వీటికికూడా "ఇన్‌ఫ్లేషన్" వచ్చి పడిందా యిరి! భమిడిపాటి కామేశ్వరరావుగారు చెప్పినట్లు, వరుల ధరలకుకూడా ఒక కంట్రోలూ దిబ్బా వుండాలని ఎవరూ ఆలోచించరాయిరి! సీతారామయ్యగారి సంసారమూ చితికిపోయింది. తనకున్న భూమిని తనఖాపెట్టి బ్యాంకులో పుచ్చుకున్న డబ్బును వడ్డీ వ్యాపారంలో తిప్పాడు. కాని, అప్పుపుచ్చుకున్న పీనుగులు దరిద్రనారాయణ (పాపర్) సర్టిఫికెట్టులు తీసుకురావడంతో ఆస్తిఅంతా వేలమైపోయి, అప్పుపోగా 2,000 రూపాయలు చేతి కొచ్చాయి. లేకపోతేనా? నాణ్యమైన వరుణ్ణి తెచ్చి శారద పెళ్లి వైభవంగా చేసేవాడే.

కాని, ఆయన లౌకికజ్ఞానం, అనుభవం వున్న వ్యక్తి. నవనవలాడే వంకాయలధర మండపోతున్నప్పుడు నాసిరకం కాయలు చవగ్గా కొనడంలోని "ఎకానమీ" ఆయనకు బాగా తెలుసు. మార్కెట్టులో సెకండుహేండు వస్తువులు చవగ్గా దొరుకుతాయి. వాడకం హెచ్చినకొద్దీ వాటిధర తగ్గుతూంటుంది. కొన్నివస్తువులు ఎదురిస్తేనేగాని చెల్లుబడి కానంత విపరీతంగా వాడబడి వుంటాయి. అవివాహిత పుత్రికాభారంతో క్రుంగిపోయే తండ్రులు వివాహ పుమార్కెట్టులో రెండోపెళ్లి పెళ్లికొడుకులను వదకటం కద్దు. సీతారామయ్యగారు తన పిల్లను రెండోపెళ్ళివానికిచ్చి పెళ్ళిచెయ్యాలని ఏనాడో నిశ్చయించుకున్నాడు. కాని ఈ ప్రసక్తి వచ్చినప్పుడల్లా, ఆయన భార్యారత్నం ఉరిపెట్టుకొని చస్తాననేది. అయితే, ఆయన, భార్య బెదిరింపులకు భయపడి దాసోహం అనే ఘటం కాదు.

ఆయన దృష్టిలో ఈమధ్య కొన్నాళ్ళనుంచి శంకరం మెలగుతూ వచ్చాడు. ఒకానొక శుభముహూర్తాన (ముహూర్తం చూసుకోందే ఏపనీ చెయ్యని ఛాందసుడాయన) భార్య చస్తే చచ్చిందని, శంకరంతో ఈమాట కదిలేద్దామని ఆయన బయల్దేరాడు.

నెమ్మదిగా నడవబడుతూ శంకరం ఇల్లు చేరుకొనేసరికి చీకటిపడింది. శంకరం అప్పుడే వచ్చిన పేపరుతీసి చదువుదామనుకుంటూండగ సీతారామయ్యగారు కనిపించారు. వెనక తన్నీ, తన స్నేహితుణ్ణీ ఆయన ఎంత యాగీచేసినప్పటికీ, ఇంటికి వచ్చిన అతిథి కాబట్టి, చూపవలసిన మర్యాదంతా చూపించాడు. "లోపలికి దయచేయండని" కుర్చీ చూపించాడు. అలసివుండటంవలన సీతారామయ్యగారు పడకుర్చీలో కూలబడ్డారు.

"ఏమండీ ఇల్లా వచ్చారీవేళ? నావల్ల ఏమైనా పనుందా?" అని అడిగాడు శంకరం.

"అబ్బే, పనీలేదూ పాడూలేదు. మావంటి ముసలివాళ్లకి మీవంటి పడుచువాళ్ళతో కాస్సేపు కాలక్షేపం చెయ్యా

లని వుంటుంది. అది అసహజమంటారా?" అన్నాడు సీతారామయ్యగారు.

ఆయన పేరు మోసిన లౌకికుడు. ఆయనతో 5 నిమిషాలు మాట్లాడితే లౌక్యం అంటే ఏమిటో తెలుస్తుంది. ఆయన పని లేందే ఎవరిదగ్గరికీ, ముఖ్యంగా అపరిచితుల వద్దకు పోడు. కాని, వెళ్ళినప్పుడు ఫలానా పనికోసమే వచ్చానన్నట్లు మాట్లాడడు. ఏదో ఈ కబురు ఆ కబురు చెప్పుతూ ఎల్లాగో తను వచ్చిన పని విషయం సంభాషణలోకి లాక్కొస్తాడు. కాని ఆయన వెళ్ళాక ఆయన వచ్చినపని 'వరికుటు'కు కూడా తెలిసిపోతుంది.

"మీరల్లా అన్నందుకు కృతజ్ఞుణ్ణే కాని, మీరు వూరికే వచ్చారంటే నమ్మలేకుండా వున్నాను. మహాత్ములూ రకరారంటారు. ఇన్నాళ్ళూ నన్నూ రామాన్ని పోకిరీవెధవలకింద కట్టి మీ రంతా యాగీచేశారు. అటువంటి మీరు నాతో కేవలం కాలక్షేపం చెయ్యడానికి వచ్చారంటే ఆశ్చర్యంగా వుండదూ! మీరే చెప్పండి." అని కొంత వుక్రోషంతో అన్నాడు శంకరం.

"అమ్మమ్మమ్మా. అలా అనకండి. మేమేదో పూర్వకాలపు ముండాకొడుకులం. కాలం మారిపోయిందని తెలుసుకోకుండా మావలె మిమ్మల్ని గుండుచేయించుకొని, పిలకపెట్టుకొమ్మనడం నిజంగా మూర్ఖత్వమే. దానిని మీరంత యిదిగా పట్టించుకోనవసరం లేదు. గతాన్నంతా మరచిపొమ్మని చెప్పడానికే నేనువచ్చాను. అయినా, వెధని కాకపోతే, మీరే డ్రెస్సు వేసుకొంటే నా కెందుకు చెప్పండి. ధా ధా" అని ఇంకా ఏమోమో స్వస్తోత్రం చేసుకుని, మయాన్ని "మీరల్లా తిట్టుకుంటూంటే నేను భరించలే"నని శంకరంచేత అనిపించుకొని, సీతారామయ్యగారు నెమ్మదిగా టాపిక్ మార్చారు.

"అయితే భోజనం హోటల్లోనా ?"

"అబ్బె లేదండి. హోటళ్లు మరీ 'డర్టీ'గా వుండడంవల్ల స్వయంపాకమే మొదలెట్టాము."

"మంచిపనిచేశారు. ఈ పాడుహోటల్లో అడ్డమైనతిళ్ళూ తింటూంటే, డబ్బు దండగే కాకుండా ఆరోగ్యం కూడా చెడిపోతుంది. అయినా మీలాంటివాళ్లు వంటచేసుకుని చేతులు కాల్చుకుంటూంటే, నా కేదో చిన్నతనంగా వుంది సుమండి. ఎంతకాలం ఇల్లా తంటాలు పడతారు పాపం? పోనీ ఎక్కడైనా మంచి పిల్లనుచూసి పెళ్లి చేసుకోపోయారూ? మీకంటె పెద్దవాళ్లెంతమంది మళ్లీ పెళ్లి చేసుకోలేదు?"

శంకరానికి ఆయనవచ్చిన పని తెలిసిపోయింది. ఇంతవరకూ ఆయన కబుర్లతో బోరెత్తిపోయాడు. కాని సంభాషణ ఇప్పుడు రసకందాయంలో పడింది. శంకరానికి హుషా రొచ్చింది.

"అయితే, పెళ్లిచెసుకోమంటారు?"అని అడిగాడు లోపల నవ్వుకుంటూ.

"తప్పకుండానూ. అదేమి టండోయ్? మీరు పెళ్లిచేసుకుంటానంటే ఎవరు ఆక్షేపించగలరు? వయసు మళ్లిందా అంటే అదీలేదు. 30 ఏళ్లుంటాయేమో? అంతేనా" అని అడిగాడు సీతారామయ్యగారు.

"మీరేమీ అనుకోకుండావుంటే ఒకమాటడుగుతాను" అన్నాడు శంకరం.

"అబ్బెబ్బె. నే నేదో అనుకోవడమేమిటి నా పిండాకూడు? చెప్పండి. చెప్పండి."

మీ ధోరణిచూస్తే పెళ్లి రాయబారానికి వచ్చినట్లు అనిపిస్తోంది నాకు."

"వస్తేమాత్రం తప్పేమిటండీ? వృద్ధిలోకి రావలసిన మీవంటి కుర్రాళ్లు కష్టపడుతూంటే వూరుకుంటే మా పెద్దతనం ఎందుకూ తగలబడనా ?"

"తప్పేమీ లేదు లెండి. కాని నావంటి పోకిరివాడికి పిల్లనిచ్చే పెద్దమని షెవరని?"

"అదేమి టండోయ్. మీకు పిల్లనిచ్చి పెళ్లి చెయ్యటమే మహద్భాగ్యం. మీకేం లోటని? వయస్సా చిన్నది. అందవికారులు కాదుకదా? ఆస్తికి ఆస్తివుంది. వుద్యోగం పురుషలక్షణం అని చేస్తున్నారు కాని, అసలు 4 గుర్ని పోషించగల తాహతుంది మీకు."

"అదంతా నిజమే కాని, మమ్మల్ని ఈవూళ్లో అసహ్యించుకోని వాళ్లెవరైనా వున్నారా అని నా సందేహం!"

"ఏదో చిన్నచిన్న విషయాలలో మాటామాటా వచ్చినంత మాత్రాన మిమ్మల్ని గర్భశత్రువుల్లాగా చూస్తున్నారనుకోకండి. ఆమాటకొస్తే, ఎవరూ ఇయ్యక్కర్లేదు. నిక్షేపంలా, మా శారదనిచ్చి పంతానికైనా మీకు పెళ్లి చేస్తాను. ఏమనుకున్నారో?"

మీరీ విషయం కదిపేరుకాబట్టి ఇంకొక విషయం చెప్పాలి. నేను కీర్తిశేషులైన వీరేశలింగంగారి శిష్యుణ్ణి. నా భార్యచనిపోయిన తర్వాత పెళ్లి చేసుకోకూడదనుకున్నాను. ఒకవేళ చేసుకొంటే విధవా వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. భార్యపోయినవాడు భర్తపోయిన స్త్రీని వివాహంచేసుకోవడం సబబు. శంకరం కోరకబడటం లేదని, సీతారామయ్యగారు అక్కడనుంచి ఉడాయించడం మంచిదనుకున్నాడు.

"సరేలెండి. మళ్లీకలుసుకుందాం." అని సీతారామయ్యగారు లేచారు.

"మీమనస్సుకు కష్టంకలిగిస్తే క్షమించండి. పోనీ మా రామంతో ఈవిషయాన్ని కదలేసిచూడండి. అతనికినాకున్న షరుద్దేశ్యాలు లేవు లెండి."

"ఏమిటండీమీరు నేనిందుకోసమే పని కట్టుకుని వచ్చానన్నట్లు మాట్లాడుతారు? అయినాకాని, గుళ్లో అయిన భాగోతం మీకు తెలుసుకదా? అతనికి నా పిల్లనెల్లా ఇచ్చేది?"

"మీరల్లా అనకండి. ఆభాగోతం జరిగ జరగడంవల్ల ఇప్పుడువాడు చాలా బుద్ధిమంతుడయ్యాడు. ఇప్పుడా స్త్రీముందు నడుస్తూంటే వాడసలు నడవనే నడవడు."

"ఏమోనండీ, మీసలహా పంచదారగడిగితే ఉప్పు వుందన్నట్లుంది." అని సీతారామయ్యగారు గొడుగు తలమీదవిప్పి తుంపరలలో ఇంటిదారి పట్టారు.

## 3

3 నెలల తర్వాత

సీతారామయ్యగారికి పిచ్చెక్కినట్లయింది. సంసారం ఇంత రచ్చకెక్కింతర్వాత బతికేం? చసేం? చస్తే నేమేలను కున్నాడు. భార్యవొంతు తను పుచ్చుకుని నూతిలోపడి చస్తానంటే శారద పెళ్లి చేసి మరీ చావమన్నది భార్య.

ఇంతకీ ఏమైందంటే, ఆయన పెద్ద కూతురూ, వితంతువూ అయినకమల శంకరంతో లేచిపోయింది. ఇంతకంటె అవమానం ఏమైనావుందా? నలుగురిలో తలెత్తుకుని తిరగలేక ఇంట్లో నే క్రమగ్గిపోతున్నాడాయన. కమల ఆ శంకరం వలలో పడి తన గొడవే చూసుకుందిగాని తన తల్లితండ్రుల ప్రతిష్ఠగురించిగాని, తన చెల్లెలు పెళ్లి గురించిగాని ఆలోచించిందా? శారద కింక ఎవడు పుస్తెకడతాడు, సంసారానికి ఇంత మచ్చవచ్చినతర్వాత? ఎంత అఘాయిత్యం చేశాడు ఆ శంకరంగాడు మర్యాదస్థుడిలాగ వున్నట్టేవుండి! తన కూతురు అంత నేటు సాహసిస్తుందని తనెన్నడూ అనుకోలేదు.

తన బంగారం మంచిదైతే ఆ శంకరాన్ని అనవలసిన పనేముంది? వాడు విధవనే పెళ్లాడుతానన్నాడు. దాం తగలయ్య, తన కూతురే వాడి ఆశయాన్ని తీర్చాలిగావును? తన కూతురుగాక ఇంకే యితర వెధవముండతోనైనా లేచిపోతే తన కేమీ బాధ లేకపోను. ఇంతకీ ఇంట్లో "పీనుగులు" ఆయన మాట వింటేగా? ఏమిటో, ఇంట్లో అంతా చెరువునీళ్లు లేకపోతే వురిపెట్టుకుని చస్తా

మంటారు? చెరువునీళ్లు తెచ్చుకున్నా పరవాలేకపోను? కమలని రాత్రిళ్ల నీళ్లకని పంపక నువ్వే తగులడవే అంటే పెళ్లాం ప్రతీదానికీ ఎతిఅంటే ప్రతిగదా?

ఊర్లో వాళ్లుమాత్రం తక్కువ తిన్నారా? ఇన్నాళ్లు వూరుకుండి, దొంగపక్ష, ఆరునెలలకు ఒక్క మొరిగినట్లు, ఇప్పుడు ఒక్కటొక్కటే బయటపెడుతున్నారు. ఆ శంకరంగాడు కమల రోజూ చెరువుగట్టు దగ్గిర కలుసుకుని సరసాలాడుకొనేవారట! అందుకే కామోసు, ఆ మధ్యన ఇంట్లో చెరువునీళ్లు 8 గంటలకల్లా అయిపోవడం, ఈ టక్కులాడి నే తీసుకొస్తానంటూ వెళ్లి కొంచెం ఆలస్యంగా రావడం పదేపదే జరిగేవి. శంకరం మొదట్లో తనదగ్గరకు వచ్చి కమలను తనకి, శారదను రామానికి ఇచ్చి పెళ్లి చెయ్యమని అడిగితే, ఏదో పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో పడి గొప్పకి విధవని పెళ్లిచేసుకొంటానంటున్నాడనుకున్నాను. అయినా, వాడి మూర్ఖత్వం తగలెయ్య, శుభ్రమైన పిల్లని పెళ్లాడమంటే, వెధవముండనే పెళ్ళాడతానని ఏడ్చేవాడు? అప్పటికే కమలను వాడు బుట్టలో వేసుకునివుంటాడు! కమలను తనకిచ్చి పెళ్లిచెయ్యమని వాడు తనతోనూ, శారదని పెళ్లాడమని తను వాడితోనూ వాదిస్తూంటే, అంతా తలుపుచాటునుంచి ఆ కమల పీనుగ చెవులు నిక్కపొడుచుకుని వింటదట- పెళ్లాం నిన్న చెప్పింది. ఇంకో ఏడాది పోయాక తగులడకపోయిందీ? ఆవిడకేం? ఇంట్లో దుబ్బరంగా ఇద్దెనులాగ వూరుతోంది. బయట తాను భరించాలి రొష్టుఅంతా భార్యను తోసేసినా పాపం వుందీ?

సీతారామయ్యగారికి కోపం ఆగక, తిన్నగా వంటింట్లోకి పోయాడు.

"ఏమండీ, వాళ్ల జాడేమైనా తెలిసిందా? వుత్తరం రాలేదూ?" అని నరసమ్మగారు ఆదుర్దాగా అడిగింది.

"నీపిండాకూడు. వుత్తరం లేకేమీ లేదు. ఇంకా ఆ తుంటరిముండమీద మమకారం పోలేదు నీకు. ఇన్నాళ్లూ గారంమప్పి, సంసారాన్ని నట్టేట్లో ముంచావు. రేపు ఈ శారదకూడా ఏ తురాకాడితోనో లేచిపోతేగాని నీ ప్రేమ చరితార్థం కాదు."

"అదేమిటండీ. మీ దంతా చోద్యం. నేనేమన్నా వాళ్లని లేచిపొమ్మన్నానా? రోజులల్లా మండిపోతున్నాయి. దానికి మనమేం చేస్తాం? మన మొహాల్ని ఇల్లా రాసిపెట్టాడు భగవంతుడు."

"నీ ధోరణి చూస్తే, నువ్వు లేచిపోయేట్లున్నావు."

"ఛా, అటువంటి మాటలనకండి" అని నరసమ్మగారు కంట తడిపెట్టుకుంది.

"ఏముందీ, అన్నింటికంటే బ్రహ్మాస్త్రాలు ఏడుపు, నూతిలో పడతానని బెదిరింపు, నేనే లేచిపోతాను తీరిపోతుంది. లేకపోతే దుబ్బరంగా నూతిలోపడి చస్తాను. నే నింక పడలేను బాబూ ఈ బాధలు, చస్తే, మోక్షమైనా వస్తుంది."

"మీరా మాటలనే కన్న నన్ను చంపండి తీరిపోతుంది. పోనీ వాళ్లని వెతికి పట్టుకుని పిల్ల నింటికి తీసుకురాకూడదూ, అల్లా ఇంట్లో కూర్చుని అందరిమీదా భగ్గుమనకపోతే?"

"ఆ ముండ ఒకవేళ వచ్చినా, ఇంట్లో అడుగు పెట్టనియ్యను."

ఇంతలో శారదవచ్చి ఒక కవరు ఇచ్చిపోయింది. వుత్తరం నెమ్మదిగా చదివి, సీతారామయ్యగారు మళ్లీ అందుకున్నారు.

"చూశావా, ఆ శంకరంగాడు వుత్తరం వ్రాశాడు. ఆ పీనుగు లిద్దరూ పెళ్లి చేసుకున్నారట మద్రాసులో. వాళ్లని క్షమించి ఆశీర్వదించాలిట. పైగా, ఒక అమాయిక స్త్రీని సంఘకర్కశ పాశాలనుంచి విముక్తురాలిని చేసినందుకు గర్విస్తున్నాడట. వీడి శార్ధం."

"ఆ, పెళ్లాడమే? ఔర! ఎంత ఘోర కలి."

"పోనీ, పిల్ల సుఖంగానైనా వుంటే."

"దానికేం? అది ఆ శంకరంగాడితో సుఖంగానే వుంటుంది. కాని, దాని కేది సుఖాన్నిస్తోందో, అది మన తాడు తెంచుతోం దిక్కడ. ఈ శారద నెవడు పెళ్ళి చేసుకుంటాడే? పెళ్లి చెయ్యలేం. చెయ్యకపోతే నిష్ఠూరం. మొన్న జ్వరం వచ్చినప్పుడు నా ప్రాణం పోయినా బాగుండును. ఆ భగవంతునికి దయ లేదు?"

"అదిగో, అటువంటి శాపనార్థాలెట్టుకుని నన్ను చంపొద్దని చెప్తున్నాను." అని నరసమ్మగారు నెత్తిని మోదుకోవడం మొదలెట్టింది.

శారద వచ్చి ఎవరో వచ్చారని చెప్పగా సీతారామయ్యగారు భార్యా దూషణ విరమించి, వాకిట్లోకి వెళ్లి వచ్చిన వ్యక్తిని చూసేటప్పటికి, ఆయనకు అరికాలిమంట నెత్తికెక్కింది. ఆ వచ్చిన వ్యక్తి రామం.

"ఏం స్వామీ, నువ్వేమి వెలగబెట్టడానికి వచ్చావు" అని సీతారామయ్యగారు గదమాయించారు.

నేను మీ శ్రేయస్సుకోరేవచ్చాను. నాకు తెలుసు మీ శారదకు పెళ్లి చెయ్యడం చాలా కష్టమని. ఏదో నా మిత్రునివల్ల మీకె అపదసంభవించింది కనుక, కొంత పాపపరిహారార్థం, నేను మీ అమ్మాయిని ఏమీ కట్నంలేకుండా పెళ్లి చేసుకుంటానని చెప్పటానికి వచ్చాను" అన్నాడు రామం.

"నా కూతుర్ని పెళ్ళిచేసుకుంటానని చెప్పడానికి నీకు సిగ్గులేదూ? పిల్ల లేచిపోయినందుకే మొహం చెల్లకుండా వుంది కదా? అటువంటప్పుడు, నా రెండో పిల్లని నీవంటి పోకిరీవాడికిచ్చి పెళ్లి చెయ్యమంటావ్?"

ఎక్కణ్నుంచి వచ్చిందో, నరసమ్మగారు సణగడం ప్రారంభించింది. "అబ్బా, ఏం పట్టుదల? ఏంమూర్ఖత్వమమ్మా. కట్నం ఇచ్చుకొనే తాహతు లేదు. 'కట్నం లేకుండా, అందులో ఈ పరిస్థితుల్లో పెళ్లాడుతా'నంటూ పెళ్లికొడుకు తనంతట తానువస్తే వంకలు పెట్టడం. అవ్వా కావాలి బువ్వా కావాలంటే ఎల్లా?"

"వధవ సణుగులు సణక్క అవతలికి దయిచెయ్యి...కదిలావా లేదా?"

"అవిజ్ఞోంగకండీ తిడతారు పాపం. తల్లిగ వుంటుంది. మీరు నన్ను తుంటరి అంటున్నారు. కాని మీకుమార్తెమాత్రం పతివ్రతా? మీశారద ఒక భాగ్యవంతుని వాగ్దానాలనునమ్మడం, పెద్దసంబంధం వస్తోందని మురిసిపోయి కొంతమాసీ చూడనట్లు మీరు వూరుకోవడం, మీ అమ్మాయికి కడుపు రావడం, తర్వాత ఆ అబ్బాయి తండ్రి ఇంకో పెద్దింటి పిల్లని..."

"చాల్లే వూరుకో. ఇవ్వన్నీ ఎవరు చెప్పారు నీకు."

"మీ శారదే చెప్పింది. ఈవిషయం దాచకుండా చెప్పి, క్షమాపణ వేడుకోబట్టే, ఆమె అంటే నాకు గౌరవం ప్రేమ ఏర్పడి ఇప్పుడు 'పెళ్లిచేసుకోడాని' కూడా సిద్ధపడ్డాను."

"మీ ప్రేమ తగలబెట్టా: ఒసేవ్. ఆపీనుగు నిల్లాపిలు."

శారద వచ్చి తలుపు వెనకాలనుంచుంది.

"ఇల్లా ఎదురుగుండా తగులడు. ఓసి నిన్ను తగలెయ్యా. మీ రెక్కడ చెడపుట్టారే? ఇదంతా ఇతనికి చెప్పావుటే? మాట్లాడవేం రాయిలా?"

శారద సమాధానం చెప్పకుండా లోపలికి పోయింది.

ఆమట్టున సీతారామయ్యగారు భార్యకేసి తిరిగి "ఆహా ఎటువంటి పుత్రికారత్నాలను కన్నావే? వజ్రపు తునకలు. ఏమోయి రామం, నువ్వు ఈ శారదని తీసుకుని ఈరాత్రే లేచిపో. నాకు శని విరగడైపోతుంది. కాని ఇక నాగుమ్మం తొక్కా

(26-వ పేజీచూడండి)

# నే నెవణ్ణి

(15-వ పేజీ తరువాయి)

తీరతాము. కొందరిని గుర్తించినట్లు కనపడతాము. కాని, మరికొందరు తాముకూడా ప్రపంచంలోనే ఉన్నట్లు పదేపదే చెప్పుకుంటూ బాధించకపోతే ఇతరులు ఎవరూ గుర్తించలేరు. నేనుకూడా అలాంటి వర్గానికి చెందినట్లు నాకు చాలకాలంగా భయం ఉంది.

ఇంతకీ కమ్యూనిస్టుల విషయంలో నాకైతే అభిప్రాయాలు లేకపోలేదు. కాని, వాటికి ఒకనిర్దుష్టమైన స్వరూపం అంటూ ఏమీ లేదు. నేను కమ్యూనిస్టునా? నా సిద్ధాంతాలు ఏమిటి? అని నిత్యమూ తర్కించుకుంటూ ఒక నిర్ణయానికి రాలేక, వచ్చినా గుర్తించడానికి దమ్ములు లేక అయోమయ అగమ్యస్థితిలో పొరాడుతున్న నేను ఇదమిత్థ మని నా అభిప్రాయాలను మరొకరికి ఎలా వివరించి చెప్పగలను?

అయినా, ఆ వ్యక్తి కమ్యూనిజమ్ అన్నా, కమ్యూనిస్టులన్నా, సోవియట్ సాహిత్యం అన్నా తగని శ్రద్ధ చూపుతున్నాడు. కనుక ఇదేదో తేల్చుకోవడం మంచి దనుకున్నాను.

అదే అభిప్రాయంతో "కమ్యూనిస్టులంటే ఎవరూ? మానవుని పరిస్థితి చక్కపడాలనీ, ఒక మానవుడు మరొక మానవుని భక్షించకుండా ఉండే రకమైన సామాజికవ్యవస్థ ఏర్పడాలనీ మనం అంతా కోరుకోనడం లేదూ? అంతవరకు మీరు, నేనుకూడా కమ్యూనిస్టులమే ఏమో?" అన్నాను.

అవ్యక్తి ఆకస్మికంగా లేచి నిలబడ్డాడు. నాదగ్గరికి వచ్చాడు. నా బల్లమీదనే అంతవరకు మౌనంగా కూర్చున్న అతని అనుయాయి, అగస్త్యభ్రాత సదృశుడు నా దగ్గరగా జరిగాడు.

రాకడ చూచాను. అయినా ఇంకా కొంత మసకమసకగానే ఉంది. జేబులోంచి సిగరెట్టుపెట్టె తీసి అందించాను. అక్కర్లేదన్నాడు. సిగరెట్టుతీసి ముట్టించాను.

ఆ వ్యక్తి నా ముఖందగ్గర తన ముఖం పెట్టి తగ్గుస్థాయిలో "మీరు నల్లగొండ, సూర్యాపేట ఎప్పుడైనా వెళ్లారా" అని ప్రశ్నించాడు.

అప్పటికి కొంచెం అర్థమయింది. ఇది పోలీసువారికి సంబంధించిన అపరాధ పరిశోధన పద్ధతి కావచ్చు అనుకున్నాను. ఆంధ్రుడు. చేతిలో సోవియెట్ పుస్తకాలు. నీరసంగా, ఎర్రటికళ్లతో ఉన్నాడు యువకుడు. చదువుకున్నవాడిలా ఉన్నాడు. ఇక కమ్యూనిస్టు కాడని ఎలా అనుకోవడం? జీతాలు పుచ్చుకుంటూ ఊరికే కూర్చోడం న్యాయం కాదు. కమ్యూనిస్టే అయితే సరేసరి-బహుమానం ప్రమోషన్ కూడా లభించవచ్చు. కాదా, నిర్భాగ్యుడు ఎవరైనా వారికి అవసరంలేదు.

"వెళ్ళలే" దన్నాను సూటిగా చూస్తూ. నిజానికి నల్లగొండ, సూర్యాపేట వెళ్ళలేదు కాని, హైదరాబాదులో అయిదేళ్లు గడిపాను.

"మీరు పార్టీలో సభ్యులా? చెప్పండి సార్, పరవాలేదు" అంటూ, స్వరం మరి కొంత తగ్గించి "నేనూ, ఆయనా (నాపక్క కూర్చున్న మహనీయుడు) కూడా పార్టీలో సభ్యులమే" అన్నాడు.

ఇంకేమి? సరిపోయింది. పోలీసులు తప్ప ఇంత చాకచక్యం ప్రదర్శించేవారు మరొకరు ఉండరు.

"కా"దన్నాను.

"చెప్పండి సార్, మనమంతా ఒకటే," అని ధైర్యం చెప్పాడు.

ఇంక ఈ వ్యవహారం ఇంతటితో ముగించడం మంచిదనుకున్నాను.

"మీతో రెండుమాటలు చెబుతాను వినండి. మొదటిది నేను గత మూడేళ్లుగా మద్రాసులో ఉంటున్నాను. పత్రికారచయితగా పొట్టపోసుకుంటున్నాను. ప్రస్తుతం - పత్రికలో పనిచేస్తున్నాను.

"ఇక రెండవది. నాకు ఏ పార్టీతోను సంబంధం లేదు. పార్టీతో సంబంధం ఉండి, నిజంగా అండర్ గ్రౌండ్‌లో ఉన్న ఏకమ్యూనిస్టుకాని తాను కమ్యూనిస్టుననీ, నల్లగొండ, సూర్యాపేటలనుంచి వచ్చాననీ మీతో కాని, మరెవరితో కాని చెప్పడు. ఇంతకీ- మీరు ఎవరో, ఎక్కడ ఉంటున్నారో, ఏమి చేస్తున్నారో చెప్పారు కారు. చెబుతారా?" అని అడిగాను కొంచెం కటువుగా.

"మీరు సబ్ ఎడిటర్ గా పనిచేస్తున్నారా, సార్?" అని కొంచెం తెల్లబోతూ ప్రశ్నించాడా వ్యక్తి.

"అవును-పత్రికలో. మీరు పోలీసులేనా? మీ స్టేషన్ ఎక్కడ? నేను కూడా వస్తాను. మీ ఆఫీసర్ ఎవరైనా ఉంటే ఒక్కసారి మాట్లాడతాను" అన్నాను.

ఆ ఇద్దరు వెంటవెంటనే ముఖాలు చూసుకున్నారు.

ఆ వ్యక్తి కొంచెం కంగారుపడ్డాడు. "అబ్బే మేము పోలీసులం కాము. మీ విషయంలో కొంచెం పొరపడ్డాం. క్షమించండి సార్" అంటూ నెమ్మదిగా వెనక్కు తగ్గి "పోదామా" అని నా పక్క ఆసామీని తమిళంలో హెచ్చరించాడు.

ఆ ఇరువురు ఇక నా మాట లేమీ వినకుండా స్టేషన్ దాటి బయటికి వెళ్ళిపోయారు.

సరిగా గుమ్మంలో వారికి ఎదురుగా వస్తున్న ఒక రైల్వే ఉద్యోగి "గుడ్ నైట్, ఇన్‌స్పెక్టర్" అని సంబోధించడము, ఆ అపరిచిత వ్యక్తి "గుడ్ నైట్" అని బదులు చెప్పడము విన్నాను.

అంతలో బెంగుళూరు పాసెంజరు వస్తూన్న సవ్వడి అయింది. ఆ ఇరువురు పోలీసులారీవద్దకే వెడతారో లేదో చూచే భాగ్యం లేకుండా రైలుదగ్గరికి పరుగెత్తుకుని వెళ్ళాను.

ఇంతకీ నే నెవణ్ణి??? ★

# కాలం మండిపోతోంది

(12-వ పేజీ తరువాయి)

రంటే కాళ్లువిరక్కొడతాను. తెలిసిందా?"

సీతారామ్యగారు శారదని మళ్లీపిలిపించి యిల్లా అన్నారు "ఏమే, ఇతనితో ఈ రాత్రి లేచిపోతావా లేక నన్ను గెంటెయ్యమంటావా? ఏదోటి చెప్పవంటనే."

శారద మొహం పమిటలో మూసుకుని రాయిలా తల్లి వెనకాలనుంచుంది.

"ఆసిమిమ్మల్ని తగలెయ్య, ఎంతరగడు దేలిపోయారే? అబ్బాయి, నువ్వు ఈరాత్రి దీంతో లేచిపోకపోతే, రేపొద్దున్న దీన్నింటోనించి గెంటేస్తాను. ఇటువంటి కూతుళ్లుంటే అప్రతిష్టతప్ప ఏమీలేదు. తెలిసిందా. నువ్వింక దయచెయ్యి."

"చూశారా. అంతా మన మేలుకే వచ్చిందనుకోమన్నారు. కమలగోరు లేచి పోమట్టే శారదగారికి కూడా కానీఖర్చు లేకుండా మొగుడు దొరికేడు గిందా?" అనా పాలు పితకడానికి వచ్చిన గొల్ల వెకన్న.

"ఏడిశావ్ నోరుముయ్యి" అని, సీతారామయ్యగారు స్నానానికి లేచారు.

సరసమ్మగారు వంటింట్లో వంటమాని ఏడుపు లంకించుకుంది.

"ఎందుకూ ఇప్పుడీ ఏడుపులూ పెడబొబ్బలూ? ఎవర్ని వుద్ధరించను? నేనింక ఆట్టేకాలం బ్రతికి చావనులే" అంటూ సీతారామయ్యగారు చేదెడునీళ్లు తలమీద్కి పోసుకున్నారు. ★

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.